క్లుప్తంగా

నేడు సుండుపల్లెలో గడప గడపకు కార్యక్రమం

సుండుపల్లె (వీరబల్లి) : ముండుపాండు గ్రామ పంచాయతీలో గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే మేడా వెంకట మల్లికార్జునరెడ్డి పాల్గొననున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. సంక్షేమ పథకాలు వివరిస్తూ, సమస్యలు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయం సిబ్బంది తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

పరీక్షా సామగ్రి పంపిణీ



పరీక్షా సామగ్రి పంపిణీ చేస్తున్న దృశ్యం

నందలూరు(రాజంపేట) : నందలూరు కథానిలయం అధ్యక్షుడు అబ్బిగారి రాజేంద్రప్రసాద్ ద్వితీయ వర్ధంతి సందర్భంగా మంగళవారం కొత్తప్పి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజాకుమారి, ఉపాధ్యాయుడు చంద్రశేఖర్, వాసుదేవ రెడ్డి, రామయ్య, మోదుగల రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



చిన్నమండెం ఉర్దూ పాఠశాలను తనిఖీలు చేస్తున్న డీఈఓ రాఘవరెడ్డి

చిన్నమండెం : మండల పరిధిలోని పలు పాఠశాలలను జిల్లా విద్యాశాఖాధికారి రాఘవ రెడ్డి మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. మండల కేంద్రంలోని చిన్నమండెం ఉర్దూ హైస్కూల్, దేవగుడిపల్లె ఎంపీపీ స్కూల్, హరిజనవాడ పాఠశాలలను డీఈఓ రాఘవరెడ్డి తనిఖీలు చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఎప్పటికప్పుడు వారి శక్తి సామర్థ్యాలను అంచనా వేసుకొని తరగతి గదిలో విద్యాబోధనలో మార్పులు చేయాలన్నారు. పాఠశాలల్లోని రికార్డులను, హాజరుపట్టికలను తనిఖీలు చేశారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలని సూచించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలను అందజేశారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సరస్వతి

రాజంపేట : చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని సీనియర్ సివిల్ జడ్జి సరస్వతి అన్నారు. మంగళవారం పెద్ద కారంపల్లి సచివాలయం ప్రాంగణంలో లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాల కార్మికుల చట్టం తెలుసుకోవాలన్నారు. వీధి బాలల సంరక్షణ చట్టం ద్వారా పరిరక్షించబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వరదరాజులు, న్యాయవాది నాగేశ్వరావు చౌదరి, సర్పంచ్, ఉప సర్పంచ్ వార్డు మెంబర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాఠశాలల ఆకస్మిక తనిఖీ



విద్యార్థుల నోట్ పుస్తకాలను తనిఖీ చేస్తున్న ఎంఈఓ శంకరయ్య

సిద్దవటం : మండలంలోని నేకనాపురం, ఉప్పరపల్లె గ్రామాలలోని ఎంపీపీ స్కూల్‌లను మంగళవారం ఎంఈఓ శంకరయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలల్లోని పలు రికార్డులను, విద్యార్థుల నోట్ పుస్తకాలను తనిఖీ చేశారు. నేకనాపురం పాఠశాల పరిసర ప్రాంతాల్లో గ్రామస్తులు కొంతమంది మూత్ర, మలవిసర్జన చేస్తూ అపరిశుభ్రం చేస్తున్నారన్నారు. ఇది మంచి పద్ధతి కాదని ఎంఈఓ హెచ్చరించారు. ఈ విషయమై స్థానిక సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, ఎంఈఓ సూచనతో స్పందించిన సర్పంచ్ పనులు చేపట్టి అపరిశుభ్రత లేకుండా చేస్తామని తెలిపారని ఎంఈఓ చెప్పారు. అనంతరం ఉప్పరపల్లె గ్రామంలోని ఎంపీపీ స్కూల్‌ను తనిఖీ చేసి ఏకరూప దుస్తులు, రికార్డులు, కరెక్టుగా ఉన్నాయని సంతృప్తిని వ్యక్తం చేసి ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులును అభినందించామన్నారు.

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పాలన



గాలివీడు : సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తునన ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

గాలివీడు : రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పాలనను సాగిస్తున్నారని రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆయన పందికుంట గ్రామంలో తాండ, బత్తినవాండ్లపల్లె, కొర్లకుంట గ్రామం దివగతూపల్లె, ఎగువ తూపల్లెలలో మంగళవారం గడప గడపకు కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపలోనూ గ్రామ ప్రజలు ఎమ్మెల్యేను ఆప్యాయంగా పలుకరించారు. గ్రామంలో ఎమ్మెల్యే ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు, లబ్ధిదారులకు వివరించారు. బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు. పలు సమస్యలను అధికారుల సహకారంతో అక్కడికక్కడే పరిష్కరించారు.

మా ప్రభుత్వ పాలన పార్టీలకతీతం

గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీ సభ్యులు టీడీపీ సానుభూతిపరులకే పథకాలు అందేవని, ప్రస్తుతం పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు సచివాలయం, వలంటీర్ల ద్వారా ప్రతి గడపకు తలుపుతట్టి అందిస్తున్నామని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించాలని ముఖ్యమంత్రి అధికారులకు ఆదేశించారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలలో ప్రతి కుటుంబానికి ఏదోఒక విధంగా లబ్ధి చేకూర్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జల్లా సుదర్శన్ రెడ్డి, వైస్ ఎంపీపీ మిట్టపల్లె యదుభూషన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గుమ్మా అమర్నాథరెడ్డి, సర్పంచ్‌లు హనుమాన్ నాయక్, ఉమాపతి రెడ్డి, రామాంజుల రెడ్డి, ఎం.జ్యోతమ్మ, ఉమాప్రభాకర్, ఎంపీటీసీ ముత్యాలమ్మ, జనార్దన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఖాసీం, వైఎస్సార్‌సీపీ నాయకులు భానుమూర్తిరెడ్డి, రఘునాథ, మాజీ ఎంపీటీసీ వీరనాగయ్య, గోపాల్ నాయక్, ఇరగంరెడ్డి రమణారెడ్డి, శివగంగాధర్, గంగాధర్ నాయుడు, రామకృష్ణనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చదువు, క్రీడలు సమపాళ్లలో ఉండాలి

రాయచోటి : విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలూ సమపాళ్లలో ఉండాలని వైఎస్ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. రాయచోటిలోని ఐకే ఒలంపియాడ్ స్కూల్‌లో యూత్ ఐకాన్ వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఇంటర్ డిస్ట్రిక్ట్ కబడ్డీ పోటీలను శ్రీకాంత్‌రెడ్డి సందర్శించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని సెమీ ఫైనల్ పోటీలను ప్రారంభించారు. వినయ్‌కుమార్ క్రీడాకారుల ప్రోత్సాహానికి చేస్తున్న కృషి అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. గాలివీడు ఎంపీపీ జల్లా సుదర్శన్‌రెడ్డి, పీఈటీయూ క్రమశిక్షణ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరాజు, ఐకే విద్యాసంస్థల అధినేత ఇర్షాద్, వీరాంజనేయులు, అమరనాథరెడ్డి, ఓబులేసు, కరుణాకర్, లలితమ్మ, పీఈటీ ఉపాధ్యాయులు, క్రీడాకారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

శెట్టిగుంట 2లో గడపగడపకు కార్యక్రమంలో ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు



పథకాల గురించి వివరిస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. గతంలో ఏ ప్రభుత్వం, ఏ ముఖ్యమంత్రి చేపట్టని విధంగా సంక్షేమ పథకాలు అందిస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పరిపాలన సాగిస్తోందన్నారు. మంగళవారం రైల్వేకోడూరు మండలంలోని శెట్టిగుంట-2 సచివాలయం పరిధిలో గడపగడప మన ప్రభుత్వ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి ఇంటికి వెళ్లి స్థానికంగా ఎదురవుతున్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 3648 కిలోమీటర్ల ప్రజా సంకల్పయాత్రలో ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకుని, కళ్లారా చూసినందు వల్లే ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల వెల్లువ కొనసాగుతోందన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందాలన్నదే ముఖ్యమంత్రి ఆకాంక్ష అన్నారు. రాష్ట్రంలో ఎటువంటి వివక్ష లేకుండా అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ నేరుగా సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శవంతమైనదని పేర్కొన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ఏనాడైనా ఒకటో తేదీ పింఛన్లు ఇచ్చారా అని ప్రశ్నించారు. పేదలకు అందించే సంక్షేమ పథకాలను పక్కాగా అమలుచేస్తూ సేవా దృక్పథంతో పనిచేస్తున్న వలంటీర్లపై ఎల్లో మీడియా విషపు రాతలు రాయడం ఇకనైనా మానుకోవాలని హితవు పలికారు.

మండలంలోని శెట్టిగుంట-2 సచివాలయం పరిధిలోని బాలుపల్లెలో గ్రామస్తులు మాకు రోడ్డు వేయించమని అభ్యర్థించగా వెంటనే స్పందించిన ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు సంబంధిత అధికారులతో మాట్లాడి అప్పటికప్పుడే రూ.2లక్షలతో సిమెంట్ రోడ్డుకు భూమిపూజ చేశారు. ఇందుకు గ్రామస్తులు ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ముప్పాల హేమనవర్మ, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, సర్పంచ్ ఆదినారాయణ, ఎంపీటీసీ రమణమ్మ, అంబటి మురళీ, తోట శివసాయి, నారాయణ రెడ్డి, రెడ్డయ్య, రమణయ్య, బాబు, క్రిష్టయ్య, శ్రీను, వంశీ, సుబ్బయ్య, ఎంపీడీఓ నాగార్జున పాల్గొన్నారు.

రైళ్ల హాల్టింగ్ కోరుతూ సంతకాల సేకరణ



సంతకాల సేకరణలో పాల్గొన్న విద్యార్థినులు

నందలూరు(రాజంపేట) : నందలూరులో రైళ్ల హాల్టింగ్ కోసం ఐకేపీఎస్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం బస్టాండు కూడలి వద్ద చేపట్టిన కార్యక్రమంలో సమితి నేతలు మస్తానయ్య, ఆర్ముగంవిశ్వనాథ్, జుల్ఫికర్ పాల్గొని మాట్లాడారు. కరోనా ముందు హాల్టింగ్ ఉన్న రైళ్లను తిరిగి హాల్టింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రధానంగా వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్, చెన్నై ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్ కోసం సంతకాల సేకరణ ఉద్యమం చేపట్టామన్నారు. సంతకాల సేకరణలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ, సీపీఐ, బీజేపీతో పాలు స్వచ్ఛంద సేవాసంస్థలకు చెందిన ప్రతినిధులు, న్యాయవాదులు, విద్యార్థులు, మహిళలు, యువకులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, వివిధ రంగాలకు చెందిన కార్మికులు, వ్యాపారులు పాల్గొని సంఘీభావం తెలిపారన్నారు. సంతకాల సేకరణ ప్రతులను, ఎమ్మెల్యే లేఖతో కలిపి రైల్వే ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఐకేపీఎస్ నేతలు మహేష్, హెచ్ఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు డేవిడ్ కళ్యాణ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా త్యాగరాజ స్వామి ఆరాధన



గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

చిట్వేలి : పాత చిట్వేలిలోని శ్రీత్యాగరాజ స్వామి ఆలయంలో 176వ ఆరాధన మహోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. నాయీబ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో నాయీబ్రాహ్మణ యువత పర్యవేక్షణలో శ్రీత్యాగరాజస్వామి చిత్రపటాన్ని స్థానిక శివాలయం నుంచి పాత చిట్వేలి వరకు బాణాసంచా పేలుళ్లు, మేళతాళాలు, ఆనందోత్సాహాల మధ్య గ్రామోత్సవాన్ని నిర్వహించారు. మంగళవారం ఉదయం స్వామివారికి అభిషేకాలు తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సేవాసంఘం సభ్యులు వెంకటసుబ్బయ్య, సుబ్బరాయుడు, మునిరావు, సుబ్రమణ్యం, నగేష్, యువత కార్యవర్గం సభ్యులు వెంకటేష్, మల్లికార్జున, రామకృష్ణ, రమణ, బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏలకు బయోమెట్రిక్‌ను రద్దు చేయండి



జేసీ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏలు

రాయచోటి అర్బన్ : వీఆర్‌ఏలకు అమలు చేస్తున్న బయోమెట్రిక్ హాజరు పద్ధతిని వెంటనే రద్దుచేయాలని వీఆర్‌ఏల సంఘం జిల్లా కన్వీనర్ అల్లాబకష్, కో-కన్వీనర్ భోగేశ్వరయ్య, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఎస్.ఫయాజ్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం గ్రామ సేవకుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్న డిమాండ్‌తో జేసీ తమీమ్ అన్సారియాకు ఒక వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న గ్రామ సేవకులకు కనీస వేతనాలు అమలు చేయకపోగా, రోజుకు నాలుగు పర్యాయాలు బయోమెట్రిక్ హాజరు వేయాలనడం దారుణమన్నారు. సకాలంలో వేతనాలివ్వాలని, గుర్తింపు కార్డులు, హెల్త్‌కార్డులు ఇవ్వాలంటూ కోరారు. చనిపోయిన వీఆర్‌ఏల అంత్యక్రియలకు రూ.25వేలు ఆర్థికసహాయం అందించడంతో పాటు వారి కుటుంబంలో ఒక్కరికి వెంటనే ఉద్యోగం ఇవ్వాలంటూ కోరారు. అందరికి ఇళ్లస్థలాలు, పక్కాగృహాలు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సేవకులు రెడ్డెన్న, శంకరయ్య, నాగరాజు, జబ్బార్‌బాషా, రామచంద్ర, మల్లికార్జున, మదార్‌సాహెబ్‌లు పాల్గొన్నారు.

రైతులు భూ పత్రాలను సమర్పించాలి

తహసీల్దారు శంకర్‌రావు



మాట్లాడుతున్న తహసీల్దారు శంకర్‌రావు

సిద్దవటం : జాతీయ రహదారి విస్తరణకు సంబంధించి సిద్దవటం మండలంలోని రైతులు భూములకు సంబంధించిన పత్రాలను సమర్పించాలని తహసీల్దారు శంకర్‌రావు తెలిపారు. మండలంలోని భాకరాపేటలో మంగళవారం ఎన్‌హెచ్ 716కు సంబంధించి భూములు కోల్పోయే రైతులకు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని కనుమలోపల్లె నుంచి ఉప్పరపల్లె వరకు దాదాపు 80 ఎకరాలు భూములను రైతులు కోల్పోయే అవకాశం ఉందన్నారు. కనుమలోపల్లె గ్రామంలో దాదాపు 20 ఎకరాలు, పెద్దపల్లె గ్రామంలో దాదాపు 60 ఎకరాలు, రైతులు భూముల కోల్పోయే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా రైతులు కోల్పోయే భూములకు నష్టపరిహారం తక్కువగా వచ్చే అవకాశం ఉందని తహసీల్దారు దృష్టికి తీసుకొచ్చారు. భూముల కోల్పోయే రైతులు తమ భూములకు సంబంధించిన పత్రాలను వీఆర్‌ఓకు సమర్పించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ సుధాకర్, వీఆర్‌ఓ నాని, రైతులు పాల్గొన్నారు.

పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏఎస్‌డబ్ల్యూఓ రఘురామయ్య

లక్కిరెడ్డిపల్లె : 2022- 23 మార్చి నెలలో జరగబోవు పదోతరగతి పబ్లిక్ పరీక్షలలో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని ఏఎస్‌డబ్ల్యూఓ రఘురామయ్య పేర్కొన్నారు. మంగళవారం రాత్రి లక్కిరెడ్డిపల్లిలో ఎస్సీ 1,2 బాలుర, బాలికల వసతి గృహాలను ఆయన పరిశీలించారు. మెనూ ప్రకారం పిల్లలకు భోజనాలు వడ్డించాలని, ప్రభుత్వం అందిస్తున్న నోటు పుస్తకాలు అందరికీ అందించాలని వార్డన్లకు సూచించారు. ప్రభుత్వం పదోతరగతి విద్యార్థులపైన ప్రత్యేక దృష్టిపెట్టి మెటీరియల్‌ను అందజేస్తోందని, విద్యార్థులు పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన మెటీరియల్స్‌ను బాగా చదువుకొని మంచి ఫలితాలు సాధించాలని ఆయన విద్యార్థులకు సూచించారు. ఉత్తమ ఫలితాలు సాధిస్తే ట్రిపుల్ ఐఐటీ కళాశాలలో సీట్లు సాధించవచ్చన్నారు. ఉదయం, సాయంత్రం 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి వారానికొకసారి పరీక్షలు నిర్వహిస్తూ వారి గ్రేడింగ్‌కు వార్డన్లు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులు, రమేష్ బాబు, లక్ష్మీకాంతమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షి భవన ప్రారంభోత్సవానికి ఆహ్వానం

రాయచోటి : అన్నమయ్య జిల్లా మదనపల్లెలో నిర్మించిన వాల్మీకి మహర్షి నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నమయ్య జిల్లా వాల్మీకి సంఘం నేతలు చలపతి, కృష్ణప్పలు పిలుపునిచ్చారు. మంగళవారం ప్రారంభోత్సవ కార్యక్రమానికి రావాలంటూ రాయచోటి వాల్మీకి సంఘం నేతలను ఆహ్వానించారు. వాల్మీకి సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్షులు గువ్వల యోగానందబాబు (బుజ్జి), మండ్ల భక్తవత్సలం, మండ్ల రామాంజనేయులు, సంబేపల్లి రామయ్య, మండ్ల ఆంజనేయులు, పసల నరేష్, మండ్ల రమేష్ తదితర నేతలను కలిసి నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆహ్వానించారు.

వరిలో అగ్గితెగులు నివారణకు మార్గాలు

పెనగలూరు : మండలంలో వరిపంటకు అగ్గితెగులు అధికంగా ఉందని, దాన్ని నివారిస్తే మంచి ఫలితాలు పొందవచ్చని వ్యవసాయశాఖ అధికారి పవన్ కుమార్ తెలిపారు. మంగళవారం సిద్ధవరం గ్రామంలో ఈ-పంట నమోదును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరిసాగు చేసిన రైతులు ఏఓతో తెగులు గురించి వివరించారు. వరిపంటను పరిశీలించి ఇప్పుడిప్పుడే అగ్గితెగులు ప్రభావం మొదలవుతోందని, ఆలస్యం చేస్తే పంట దెబ్బతినే అవకాశం ఉందని ఏఓ రైతులకు సూచించారు. ముఖ్యంగా వరిపంటకు మోతాదును మించి యూరియాను వాడటం వలన వరికి అగ్గితెగులు సోకుతుందన్నారు. కావున వరిపంట సాగుకు యూరియా వాడకం తగ్గించి ప్రైసైక్లాజోల్ 0.6 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారి చేసినట్లైతే తెగులు నివారించవచ్చన్నారు. అగ్గితెగులు సోకడం వలన పంట దిగుబడి తగ్గుతుందని రైతులకు సూచించారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సిద్దవటం : సిద్దవటం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ, ఆయా పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి తెలిపారు. స్థానిక ఐసీడీఎస్ సీడీపీఓ కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకరులతో మట్లాడుతూ ప్రాజెక్టు పరిధిలోని ఒంటిమిట్ట మండల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్‌ల పోస్టులు మల్లేశ్వరపురం (ఎస్టీ), ఆయా పోస్టు మలకాటిపల్లె(ఎస్సీ), సిద్దవటం మండలంలోని ఆయా పోస్టులకు సంబంధించి కొమ్మనియినిపల్లె (ఓసీ), బంగారుపేట (ఓసీ), భాకరాపేట (ఈడబ్ల్యూఎస్), సిద్దవటం 5వ వార్డు(బీసీ-సీ) కేటాయించారన్నారు. అట్లూరు మండల పరిధిలో ఆయా పోస్టులకు వరికుంట (బీసీ-డీ), గోపవరం మండలం పరిధిలో అంగన్‌వాడీ వర్కర్ పోస్టులకు నీరబ్బల్లాయపల్లె(బీసీ-సీ), ఆయా పోస్టులకు లక్కవారిపల్లె (ఎస్టీ), సుమిత్రానగర్-2 16వ వార్డు(ఎస్టీ), మహబూబ్‌నగర్-1, 13వ వార్డు (ఎస్టీ), గోరేశంకర్ నగర్ (ఎస్టీ), రిజర్వేషన్లను కేటాయించామన్నారు. దరఖాస్తులు చేసుకునే అభ్యర్థులు 1 జూలై 2023 నాటికి 21నుంచి 35 సంవత్సరాలు వయస్సు కలిగి ఉండాలి, స్థానిక వివాహిత మహిళై ఉండాలి. అంగన్‌వాడీ వర్కర్ పోస్టుకు 10 పాసై ఉండాలి, ఆయా పోస్టులకు 7వ తరగతి పాసై ఉండాలి. పూర్తి చేసిన దరఖాస్తులను 6 ఫిబ్రవరి 2023 లోపు సిద్దవటం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ కార్యాలయంలో అందజేయాలని సీడీపీఓ తెలిపారు.

ఎస్సీ, ఎస్టీలకు భూ పంపిణీ చేయండి



తహశీల్దార్ పీర్ మున్నీకి వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

ఓబులవారిపల్లె : మండలంలోని ఎస్సీ, ఎస్టీ అర్హులైన నిరుపేదలకు అసైన్మెంట్ కమిటీ ద్వారా భూములు ఇవ్వాలని సీపీఐ నాయకులు మంగళవారం తహసీల్దార్ పీర్ మున్నీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల సీపీఐ కార్యదర్శి సి.నాగమ్మ మాట్లాడుతూ మండలంలోని 22 పంచాయతీలలో భూములు లేని అర్హులైన పేదలను గుర్తించి వారికి భూ పంపిణీ ద్వారా భూములివ్వాలన్నారు. కబ్జాలకు గురైన వందలాది ఎకరాల భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పేదలకు పంపిణీ చేయాలని వారు కోరారు. వ్యవసాయ కూలీలుగా ఉంటూ ప్రధాన జీవనాధారం లేక చాలా మంది కూలీలుగానే జీవిస్తున్నారన్నారు. అటువంటి కుటుంబాలకు అసైన్మెంట్ కమిటీలో నిర్ణయించి భూ పంపిణీలో పట్టాలు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు వెంకటరెడ్డి, రోజమ్మ, తిరుపాలయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

మండల ఉపాధ్యక్షులు బాబునాగరాణి, రవిశంకర్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ మండల అధ్యక్షులు జనార్ధన్‌రెడ్డి

రామాపురం : ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు చొరవచూపాలని మండల ఉపాధ్యక్షులు బాబునాగరాణి, రవిశంకర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాసన వెంకటరమణలు అన్నారు. మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ సభా భవనంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశంలో అన్ని శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు ఆయా శాఖలపై సమీక్షించారు. వ్యవసాయం, విద్యా, వైద్య, ఇరిగేషన్, హౌసింగ్, ఉపాధి, వెలుగు తదితర శాఖల పనితీరుపై నివేదికలను చదివి వినిపించారు. భూ రీసర్వేకి రైతులు పూర్తిగా సహకరించాలని, రెవెన్యూ సమస్యల విషయంలో ఆశాఖ అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులను ఏ మాత్రం పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ ఏఈ వరప్రసాద్ రెడ్డి పనితీరుపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీఓ హైదర్‌వలీ మాట్లాడుతూ సమావేశానికి అధికారులు ప్రగతి నివేదికలతో హాజరుకావాలని చెప్పినప్పటికీ సరైన సమాచారం తీసుకురాకపోవడంతో సిబ్బందిపై ఆయన ఆగ్రహించారు. తహసీల్దార్ సత్యానందం రెవెన్యూ సమస్యలు, పౌరసరఫరాల పంపిణీపై నివేదికపై సభలో ప్రసగించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండలాధ్యక్షులు జి.జనార్ధన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు నాగభూషన్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు పెద్దిరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

4న శ్రీ కోదండ రామ శతకం ఆవిష్కరణ

ఒంటిమిట్ట : ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామ స్వామి ఆలయ ప్రాంగణంలో "శ్రీ కోదండ రామ శతకం" పుస్తకాన్ని ఆవిష్కరించి, "పోతన చరిత్ర" పుస్తకాన్ని సాధన సాహితీ స్రవంతి హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో కృతి సమర్పణ చేయనున్నట్లు ప్రధాన కార్యదర్శి శంభుని కుమార్, వ్యవస్థాపక అధ్యక్షులు సాధన నరసింహాచార్య మంగళవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా పోతన చరిత్ర పుస్తకాన్ని శ్రీమతి గొడవర్తి సంధ్య రచించారని, అలాగే "శ్రీ కోదండ రామ శతకం" అనే పుస్తకాన్ని ప్రముఖ పద్య కవి మామిళ్ల లోకనాథం(రిటైర్డ్ ప్రిన్సిపల్) రచించారన్నారు. ఈ ఆవిష్కరణకు ముఖ్య అతిథులుగా గానుగ పెంట హనుమంతరావు, పసుపులేటి శంకర్, పుట్టపర్తి నారాయణాచార్యులు, జింకా సుబ్రమణ్యం, ఎం.ఎస్ సతీష్, మామిళ్ల లోకనాథం, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.